# రేపు కేటీఆర్ రాక

- కొత్త గేటు వద్ద బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



వెల్దండ, ఏప్రిల్ 16 : మండలంలోని కొత్త గేటు సమీపంలో శ్రీశైలం-హైదరాబాద్ హైవే పక్కనున్న కేఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. 18న నిర్వహించే సన్నాహక సమావేశ ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించేందుకు ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరవుతున్నారని తెలిపారు. అలాగే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, ఎన్నికల ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డితోపాటు ముఖ్య నాయకులు రానున్నట్లు చెప్పారు. కల్వకుర్తి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కార్యకర్తలు, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ కమిటీల బాధ్యులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ మాయమాటలు, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నా రు. నాలుగు నెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి అన్ని రకాలుగా విఫలమయ్యారని విమర్శించారు. రైతుబంధు ఇవ్వనోడు, రుణమాఫీ ఎలా చేస్తాడు? కల్యాణలక్ష్మి ఇవ్వనోడు తులం బంగారం ఎక్కడి నుంచి ఇస్తాడు? అని ప్రశ్నించారు. పాడి రైతులకు నాలుగు నెలలుగా బిల్లులు ఇవ్వడం లేదని వాపోయారు. కాంగ్రెస్‌ను నమ్మొద్దని, బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆర్ఎస్పీ ఉన్నత విద్యావంతుడని, 14 ఏండ్లపాటు సేవలందించి ఎందరో పేద విద్యార్థులకు చేయూతనిచ్చాడని తెలిపారు. తండ్రీకొడుకులకు పదవులిచ్చినా బీఆర్ఎస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన రాములు, భరత్‌ప్రసాద్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. ఆయన వెంట కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వెల్దండ జెడ్పీటీసీ విజితారెడ్డి, భాస్కర్ రావు, విజయ్‌గౌడ్, సూర్యప్రకాశ్‌రావు, గోవర్ధన్, యాదగిరి, నర్సింహ తదితరులు ఉన్నారు.

# ఒత్తిడి తెచ్చి ప్రాజెక్టులు పూర్తి చేయిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- హామీలను విస్మరించిన కాంగ్రెస్‌ను ఓడించాలి
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 16 : కేసీఆర్ హయాంలో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బీడుభూములకు సాగునీరు అందిస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి అభిలాష్‌రావుతో కలిసి మాజీ మంత్రి హాజరై మాట్లాడారు. వనపర్తి జిల్లాను సస్యశ్యామలం చేసి గణప సముద్రం, బుద్ధారం రిజర్వాయర్లను ప్రారంభించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ప్రాజెక్టులను పూర్తి చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదన్నారు. పనులను తక్షణమే పూర్తిచేసి వచ్చే సీజన్‌లో సాగునీరు అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందన్నారు. కేసీఆర్ హయాంలో పల్లెలన్నీ సస్యశ్యామలం అయ్యాయని, కాంగ్రెస్ రాగానే కరువుతో ప్రజలు గోస పడుతున్నారన్నారు. పదేండ్లలో తెలంగాణను కేసీఆర్ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపితే.. కాంగ్రెస్ రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు కుట్రలు పన్నుతున్నదన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ బలపర్చిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. అందుకు ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలన్నారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను దివ్యాంగులు, యువకులు శాలువాతో సన్మానించారు, సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, సీనియర్ నాయకురాలు ప్రత్యూష, ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సామ్యానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీలను విస్మరించిన కాంగ్రెస్



అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. రాష్ట్రంలో కరువు వచ్చి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. స్థానికేతరుడైన మల్లు రవి గతంలో ఎంపీగా, ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించి ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఎంపీ రాములు సైతం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని, తన కొడుకుకు ఎంపీ టికెట్ కోసం బీజేపీలో చేరి కేసీఆర్‌కు, పార్టీకి ద్రోహం చేశారన్నారు. అతడి కుమారుడిని ఈ ప్రాంతం నుంచి ఎంపీగా గెలిపిస్తే ఏం అభివృద్ధి చేస్తారో చెప్పాలన్నారు. అధికార పార్టీ నేతలు బీఆర్ఎస్ నాయకులను బెదిరించినా, ప్రలోభాలకు గురిచేసినా కలిసికట్టుగా పనిచేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

# ప్రాంతీయ పార్టీలతోనే అభివృద్ధి

- కాంగ్రెస్, బీజేపీలకు ఓటర్లే గుణపాఠం చెప్పాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ప్రజలు మళ్లీ మోసపోవద్దు
- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వనపర్తి, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ పార్టీలకు ఓటర్లు తగిన గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గతంలో ఎంపీలుగా గెలిచిన వారు నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌ను ఏమాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. మంగళవారం రాత్రి వనపర్తిలోని హరిజనవాడ, రాజీవ్ చౌరస్తా కూడళ్లలో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించగా బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి నిరంజన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ప్రాంతీయ పార్టీలున్న రాష్ట్రాల్లోనే గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. రాజకీయ లబ్ధి కోసమే కేం ద్రం, రాష్ట్రంలో ఒకే పార్టీ అంటూ జాతీయ పార్టీలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. ఓటర్లు కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అత్యంత ప్రతిభ కలిగిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించి ఓటర్లు విజ్ఞతను చాటుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

**మళ్లీ మోసపోవద్దు: ఆర్ఎస్పీ**

అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఓటర్లు మోసపోవద్దని, ఆలోచించి ఓటు వేయాలని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నాడు డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని చెప్పి నేడు ఆగస్టులో అంటూ మాట మార్చి రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 40మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని, వారి కుటుంబాలను సర్కారు పరామర్శించలేదన్నారు. ఇక్కడి ప్రస్తుత ఎంపీ 289 రోజుల్లో కేవలం 6 నిమిషాలు మాత్రమే పార్లమెంట్‌లో మాట్లాడారని, ఇలాంటి వ్యక్తుల వల్ల పేదలకు ఏం మేలు జరుగుతుందని ప్రశ్నించారు. ఓటర్లు తనకు అవకాశమిస్తే నాగర్‌కర్నూల్‌ను అభివృద్ధిలో దేశంలోనే ప్రథమస్థానంలో నిలబెడతానన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, నాయకులు అభిలాష్‌రావు, వాకిటి శ్రీధర్, లక్ష్మయ్య, నందిమళ్ల అశోక్‌కుమార్, నరేశ్‌కుమార్, రమేశ్‌గౌడ్, తిరుమల్, రఘువర్ధన్ రెడ్డి, మాధవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్లమెంట్ సమన్వయకర్తలు వీరే..



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలను మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లో ప్రకటించారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉప్పల్ వెంకటేశ్ గుప్తా, జడ్చర్లకు ఇబ్రహీం, మక్తల్‌కు ఎండీ సలీం, దేవరకద్రకు పల్లె రవికుమార్, కొడంగల్‌కు వెంకటేశ్వర్‌రెడ్డి, షాద్‌నగర్‌కు దూదిమెట్ల బాలరాజు యాదవ్, నారాయణపేటకు రాజావరప్రసాద్, నాగర్‌కర్నూల్‌కు వాల్యానాయక్, గద్వాలకు ఎండీ ఇంతియాజ్ ఇసాక్, అలంపూర్‌కు దేవరి మల్లప్ప, కల్వకుర్తికి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, వనపర్తికి బైకని శ్రీనివాస్‌యాదవ్, అచ్చంపేటకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి, కొల్లాపూర్‌కు ఆంజనేయగౌడ్‌ను నియమించారు.



నారాయణపేటలో నిర్వహించిన పార్లమెంట్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేదికపై ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

# గులాబీ పార్టీకే జై కొట్టండి

- కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల సంక్షేమం
- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటికావడం అసాధ్యం
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నారాయణపేట, ఏప్రిల్ 16 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సమన్యాయం దక్కిందని, పదేండ్ల పాలనలో ప్రజలు, రైతులు సంతోషంగా జీవించారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అలాంటి పార్టీ అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. వారం రోజుల్లో సీఎం కేసీఆర్ పర్యటిస్తారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నారాయణపేటలో జరిగింది. ఈ సమావేశానికి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అమలు కానీ హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ప్రజలు ముందుగానే ఆలోచించి ఉంటే బీఆర్ఎస్‌కు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. నాటి పదేండ్ల కాలంలో ఒక్కసారైనా పొలాలు ఎండిపోలేదని, తాగు, సాగునీటికి, కరెంట్ కోసం ధర్నాలు కాలేదని గుర్తు చేశారు. కానీ రేవంత్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఈ సంఘటనలన్నీ పునరావృతం అవుతున్నాయని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ అమలు చేస్తామని ప్రకటించి.. ఇప్పుడేమో ఆగస్టు 15 వరకు చేస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఎంపీ ఎన్నికల ముందే రుణమాఫీ చేయని ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల ముందు చేస్తుందా..? అని నిలదీశారు. బీఆర్ఎస్ హయాం లో అమలైన పథకాలు కావాలం టే గులాబీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఓటమి భయంతో అయినా కాంగ్రెస్ పథకాలు అమలుకు శ్రీకారం చుడుతుందన్నారు. బీజేపీ, బీ ఆర్ఎస్ ఒక్కటికావడం అసాధ్యమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వ చ్చాక భూములు ధరలు తగ్గి పోయాయని వాపోయారు. పంటలు ఎండి, పింఛన్లు రాక రైతులు, వృద్ధులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారన్నారు. సుఖాలు ఉన్నప్పుడు వెంట ఉండి కష్టాలు వచ్చినప్పుడు విడిచివెళ్లే నీచమైన సంస్కృతి మనది కాదన్నారు. కష్టాలను ఎదుర్కొని అధికారం తీసుకొచ్చే వరకు నిద్రపోమన్నారు. కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పథకాలను వివరిస్తూ.. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు కేసీఆర్ పేరుచిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు.

**ఏం చేశారని ఓట్లేయాలి : రాజేందర్‌రెడ్డి**

అబద్ధపు మాటలతో జనాన్ని మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఎంపీ ఎన్నికల్లో ఏ మొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నదని బీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కై ఎన్నికల ప్రచారం చేస్తున్నట్లు సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం, అంజయ్యయాదవ్

ప్రస్తుత బీజేపీ ఎంపీ అభ్యర్థి అరుణ గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ పేట కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించిన విషయం ముఖ్యమంత్రి ఎందుకు చెప్పలేదని నిలదీశారు. కొద్ది రోజులుగా బీఆర్ఎస్ పార్టీని వీడి ఇతర పార్టీల్లోకి కొందరు నాయకులు వెళ్తున్నారని, పోయేటోళ్లను ఎవరూ ఆపలేరన్నారు. మండల, గ్రామస్థాయి నాయకులు మాత్రమే పార్టీని వీడారని, కార్యకర్తలు పోలేదని చెప్పారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక పార్టీలోకి మళ్లీ వస్తారని, అలాంటి వారిని చేర్చుకునేది లేదని తెగేసి చెప్పారు. నాలుగున్నర ఏండ్లు పార్టీని కాపాడుకుంటామని, మళ్లీ అధికారంలోకి వచ్చేది తామే అని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ ఎన్నికలతోపాటు రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్లలో బీఆర్ఎస్ విజయఢంకా మోగించాలన్నారు.

**సీఎంవి మాయల ఫకీర్ మాటలు : చిట్టెం**

సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి ఎంపీ ఎన్నికల్లో ప్రజలను మళ్లీ తప్పుదోవ పట్టించేందుకు మాయల ఫకీర్ మాటలు మాట్లాడుతున్నాడని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన రూ.7,500కోట్ల ఖజానాను మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి తన్నుకుపోయి కాంట్రాక్టర్లకు కట్టబెట్టారని ఆరోపించారు. నారాయణపేట సభలో నా తండ్రి పేరును ప్రస్తావించి ఓట్లు అడగడం రేవంత్ దిగజారుడు తనానికి నిదర్శనమ న్నారు. డీకే అరుణ మంత్రిగా ఉన్నన్నాళ్లు ఈ ప్రాంత అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, ఆమెను గెలిపిస్తే జిల్లాలో భరతసింహారెడ్డి లిక్కర్ దం దాలు మళ్లీ మొదలవుతాయని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ బలపర్చిన మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**ఉద్యమ స్ఫూర్తితో పని చేయాలి : ఆల**

పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు ఉద్యమ స్ఫూర్తితో పనిచేసి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. కేసీఆర్ దూరదృష్టితో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిపారని గుర్తు చేశారు. రేవంత్ అంతులేని హామీల భ్రమలో పడి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేసి మోసపోయారన్నారు. ఆరు గ్యారెంటీల్లో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం మాత్రమే అమలు చేసి.. మిగతావి అమలు కావాలంటే రాహుల్‌ను ప్రధాని చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాహుల్ ప్రధాని కాడు.. మిగిలిన గ్యారెంటీలు అమలు కావనే విషయాన్ని కార్యకర్తలు ప్రజలకు వివరించాలని చెప్పారు.

**రైతుబిడ్డను గెలిపించాలి : అంజయ్యయాదవ్**

బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి, రైతుబిడ్డ, స్థానికుడైన మన్నె శ్రీనివాస్‌రెడ్డిని ఎంపీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కోరారు. కేసీఆర్ విజన్ ఉన్న నాయకుడు. ఆయనెప్పుడూ రైతులు, ప్రజల పక్షాన పోరాటం చేసి అండగా ఉంటారు. కేసీఆర్‌ను తిట్టడమే సీఎం పనిగా పెట్టుకొని హామీలను నెరవేర్చకుండా తప్పించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. కేంద్రం రాష్ట్రానికి ఒక్క నవోదయ, మెడికల్ కాలేజీని కూడా మంజూరు చేయలేదని, అలాంటి బీజేపీ అభ్యర్థికి ఎన్నికల్లో ఓట్లడిగే హక్కు లేదన్నారు. సమావేశంలో నేత సలీం, మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, జెడ్పీటీసీ అశోక్ గౌడ్, అంజలి, ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు విజయ్‌సాగర్, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, సీనియర్ నాయకులు ఆశిరెడ్డి, చంద్రకాంత్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీల అధ్యక్షులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నారాయణపేటలో నిర్వహించిన పార్లమెంట్ సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

## మోసపూరిత హామీలతో అధికారంలోకి.. : ఎంపీ మన్నె

మోసపూరిత హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలనే ప్రజలు అనుభవిస్తున్నారు. 2019లో కేసీఆర్ ఆశీర్వాదంతో, ఎమ్మెల్యేల కృషితో ఎంపీగా గెలుపొందాను. బీఆర్ఎస్ పార్టీకి మంచి రోజులు ఉన్న సమయంలో వెంట ఉండి.. కష్టకాలంలో పార్టీని వీడిపోరాదని కేసీఆర్ సూచనల మేరకు మళ్లీ బరిలో నిలిచాను. ప్రతి విషయంలో మీకు అందుబాటులో ఉంటాను. ఎవరికి ఎలాంటి సమస్య ఎదురైనా పరిష్కరించేందుకు కృషి చేస్తాను. నీళ్లు. కరెంట్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 9 మంది ఎంపీలు తెలంగాణకు చెందిన ఎన్నో అంశాలను ప్రస్తావించాం. కాని కాంగ్రెస్, బీజేపీలకు చెందిన ఎంపీలు ఏనాడూ మన సమస్యలపై గళమెత్తలేదు. కేసీఆర్ కృషితో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 90 శాతం పనులు పూర్తయ్యాయి. రాష్ట్రం రాకముందు, వచ్చాక ఎలా ఉందో ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

# బీఆర్ఎస్‌తోనే సమన్యాయం

- కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలి
- బీఆర్ఎస్ పాలమూరు ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

దేవరకద్ర రూరల్(చిన్న చింతకుంట), ఏప్రిల్ 16 :బీఆర్ఎస్ హయాంలోనే అన్ని వర్గాలకు సమన్యాయం దొరుకుతుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం చిన్నచింతకుంటలో నిర్వహించిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ హాజరై మాట్లాడారు. కార్యకర్తలందరూ ధైర్యంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరిస్తూ కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. ప్రజలు ఎంతో తెలివైన వారని, కాంగ్రెస్ పార్టీ చెప్పే మాయమాటలను నమ్మే స్థితిలో లేరన్నారు. స్థానికుడైన మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కేసీఆర్ హయాంలో సభలలో హుందాగా వ్యవహరించేవారని, ఇప్పుడున్న సీఎంకు అవేవీ తెలియదని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే మరోసారి ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి తప్పుచేశామని ప్రజలు బాధపడుతున్నారని గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎక్కువ సీట్లు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలువబోతున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ విశ్వాసం కోల్పోయిందన్నారు. కేంద్రం పదేండ్లలో తెలంగాణకు ఏ మాత్రం సాయం చేయలేదన్నారు. ప్రజలకు కేసీఆర్‌పై పూర్తి భరోసా ఉన్నదన్నారు. కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్ బలపర్చిన మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అంజయ్యయాదవ్, స్పోర్ట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాము, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న గువ్వల, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్పీ

- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి
- గులాబీ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల

# మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 16 : తెలంగాణలో మూడు ఎస్సీ పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు కాంగ్రెస్ ఒక్క ఎంపీ స్థానం కూడా ఇవ్వకుండా మోసం చేసిందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. మంగళవారం నాగర్‌కర్నూల్‌లోని సాయి గార్డెన్స్‌లో మాదిగల రాజకీయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలను నిర్వహించగా ఆర్ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై వారి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు ఎంపీ టికెట్ ఇవ్వకుండా కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందన్నారు. వ చ్చే ఎన్నికల్లో మాదిగలెవరూ కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు. మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్ఎస్పీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. అనంతరం పట్టణంలో బీఆర్ఎస్ ప్రచార రథాన్ని ఆర్ఎస్పీ, గువ్వల ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, విజయ్, లక్ష్మయ్య, రజని పాల్గొన్నారు.

